# బళ్ళారిలో నీటి కోసం రైతుల ఆందోళన



**ఒకవైపు** కరువు మరొకవైపు డ్యాములలో నీటి నిలువ తగ్గిపోవడం, వున్న నీళ్లను పరిశ్రమల కోసం మళ్ళించడం రైతులకు నిరంతర సమస్యగా మారుతున్నది. ఈ పరిస్థితి రాకూడదనే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి ప్రాంతానికి నీరందించే తుంగభద్ర డ్యామ్‌లో నిండుతున్న సిల్ట్‌ను తొలగించాలని కర్ణాటక రాజ్య రైతు సంఘ హాగు హసిరు సేనే (KRRS) అధ్వర్యంలో చాలా కాలంగా ఆందోళన సాగుతూ వుంది. తుంగభద్ర ఆయకట్టు లోని హెచ్.ఎల్.సి – ఎల్ఎల్సీ పరిధిలో ఈ సీజన్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలలో పత్తి, మిర్చి, వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు వేశారు. మిర్చి పంటకైతే ఒక ఎకరానికి లక్ష రూపాయల వరకు ఇప్పటికే పెట్టుబడి పెట్టారు. డ్యామ్‌లో ఉన్న నీరు నవంబర్ 5వ తేదీ వరకే సరిపోతుందని, ఆ తర్వాత వ్యవసాయానికి నీళ్ళు ఇవ్వడం కుదరదని, జిందాల్ వంటి పరిశ్రమలకు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించడంతో రైతాంగం ఆందోళన బాట పట్టారు. కర్ణాటక రాజ్య రైతు సంఘ కార్యకర్తలు విస్తృతంగా గ్రామాలలో పర్యటించి ఈ సమస్యలపై కార్యక్రమం రూపొందించారు. 31.10.23 తేదీన వందకు పైగా ట్రాక్టర్లతో 2000 మంది రైతులు ర్యాలీ నిర్వహించి, బళ్ళారి జిల్లా ఆఫీసు ముందు ఆందోళన చేపట్టారు. డిసెంబర్ 15 వరకు నీళ్ళు ఇవ్వకపోతే వేలాది కుటుంబాలు కోట్లాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని, ఇప్పటికే కరువు వల్ల నష్టపోయిన పంటలకు పరిహారం అందలేదని, మరొకవైపు బ్యాంకులు అప్పులు తీర్చమని ఒత్తిడి తెస్తున్నారని ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంటలను రక్షించుకునేందుకు రైతులంతా పోరాటాన్ని ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉండాలని AIKMKS అనుబంధ KRRS అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి పిలుపునిచ్చారు.

★★★★★